


కావ్య సృష్ట్యాది నుంచి కన్నీళ్లే కవిత్వం క్రౌంచపక్షి విలాపం విశ్వ మంతటినీ కదలించింది. కదిలిన వాల్మీకి శోకమే ఆది కావ్యరచనకి దారితీసింది.

.... "ప్రపంచం కరుణలో పుట్టి, కరుణలో పెరిగి, కరుణలోనే విలీన మవుతుంది. కరుణ లేకపోతే కవికి వ్యక్తిత్వం లేదు. కవి లేకపోతే కరుణకి అస్తిత్వం లేదు"— అంటూ కరుణశ్రీ గారు కరుణకీ, కవికీ గల అవినాభావ సంబంధాన్ని విశదీకరించారు. ఆయన ఆరాధ్య కవిదైవమైన పోతన, సరస్వతి కన్నీటిని నివారించాడు.

"కాటుక కంటి నీరు చను
గట్టు పయింబడ నేల యేడ్చెదో. . .'

అని అడిగి, "కర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్ము భారతీ" అని అభయ మిచ్చి ఆమె దుఃఖం ఉపశమింపచేశాడు.

ఆడదాని యేడుపు గురించి ముగ్గురు కవులని పేర్కొన్నా, వారిలో ఇద్దరు మాత్రమే ఆ యేడుపుని హృదయంగమంగా వర్ణించారు. "బాల పల్లవ గ్రాస కషాయకం కలకంఠవధూకల కాకలీ ధ్వని"గా ఉపమించాడు పారిజాత కర్త. "కిన్నర వధూ రాజత్కారాంభోజకాంభోజీమేళ విపంచికా రవ సుధా పూరంబుగా" సరి పోల్చాడు వసు చరిత్రకారుడు.

అందమైన ఆడదాని యేడుపు కూడా అందంగానే ఉంటుందట. ఏం అందమో ! ఏడ్చిన ఏ అందగత్తే— నాకు అందంగా కనిపించలేదు. "చెంపల దాకా దిద్దిన దిద్దిన కాటుక అలుక్కుపోగా, పౌడరు పూత సగం తడిసి చారలు కట్టగా, ముక్కూ మొహం కన్నీటితో మరకలతో ఏకం కాగా, ఆది లక్ష్మిగా కనిపించిన ఆడది— ఆది శక్తిగా కనిపించక తప్పదు.

(ఈ మాటలు మగరాయళ్లంటే వనితాలోకం విరుచుక పడుతుంది. 'వనితాలోకం' ప్రత్యేక వ్యాసావళిలో అలంకరణ గురించి పవని నిర్మల ప్రభావతి గారు వ్రాశారు గనుక అలాటి ప్రమాదం తప్పింది.)

కన్నీళ్లు ఆడవాళ్ళకి వచ్చినంత విరివిగా, తరచుగా మగాళ్లకి రావు. అందుచేత స్త్రీలని "స్వాధీన అశ్రుకలు"గా సంభావించవచ్చు. ఏడిచి, అసాధ్యాలని సైతం సాధించుకోబట్టే బాలానాం రోదనం బలం అన్న సూక్తి పుట్టింది. బాలలంటే చిన్న పిల్లలు, ఆడ పిల్లలూను !

"నీ మోచెయ్యి తప్ప' నీ కన్నీళ్లు తుడిచే సాధనం మరేదీ లేదు." అని ఆంగ్ల సూక్తి. "పట్టరాని దుఃఖం వస్తే, కన్నీళ్లు తుడుచుకుందికి— రెండు చేతులూ చాలడం లేదు కదా, అన్ని ముఖాల కన్నీళ్లు రెండు చేతులతో యెలా తుడుచుకో గలవమ్మా" అని సాక్షాత్కరించిన దేవిని అడిగాట్ట రామకృష్ణ వికటకవి.

అసలు యేడుపంటే (నకిలీ యేడుపు గురించి సందర్భానుసారంగా వెల్లడిస్తాను) ఏమిటి ? ఎందుకు వస్తుంది ? అంటే చాలా కారణాలు చెప్పుకోవచ్చు. ఆశలు అడియాసలైతే కన్నీరు మున్నీరుగా విలపించ వలసి వస్తుంది. భారత రథ సారథి నిర్యాణం ప్రపంచ మంతటినీ సంతాప మగ్నం గావించింది.

"విశ్వమంత ఇందిరయై
విలపించెను ! విలపించెను !"

—అని చెప్పారు నారాయణరెడ్డిగారు, నెహ్రూ నిర్యాణ సందర్భంలో ? ఇలాటి విపత్తే ద్వాపరంలో అర్జునునకు సంభవించింది. ఆ దుఃఖానుభూతి మాటల కందక పోగా కన్నీళ్లే శరణ్య మయాయి. ఆ కన్నీళ్లకి కలతపడి,

"కన్నీ రెన్నడు తేన్చు తండ్రి చెపుమా !
కల్యాణమే చక్రికిన్"

—అంటూ ఆందోళన వ్యక్తపరిచాడు ధర్మజుడు.

ఉన్నది పోతే ఒక ఏడుపు. తను కోల్పోయినది యెదుటి వాళ్లకుంటే మరో యేడుపు. వాళ్ళ యేడుపు యెపుడూ ఉండేదే ! అలాటి వాళ్ల నూరడించ నక్కరలేదు.

"నవ్వే వాళ్ల అదృష్టమేమని
ఏడ్చే వాళ్లని ఏడవనీ"— అన్నాడొక సినీ రచయిత

ఎదుటి కలిమి కొందరి యేడుపుకి కారణమైతే, చేసిన పాపం మరి కొందరిని యేడిపిస్తుంది. నవ్వుతూ చేసింది యేడుస్తూ అనుభవించడం అంటే అదే ! యౌవన మదంతో కన్నూ మిన్నూ కానక విపరీతంగా ప్రవర్తించి, తల్లిదండ్రులకి దూరమైన పుండరీకుడు, చేసిన తప్పు తెలిసి వచ్చాక,

"కనిపిస్తే కన్నీళ్లతో
కాళ్లు కడుగుతానమ్మా ! నాన్నా !"—

అంటూ విలపిస్తాడు. పశ్చాత్తాపాగ్ని కీలలు దహించగా, గుండె కార్చిన కన్నీరది. దానవుని మానవునిగా చెయ్యగల శక్తి ఉందా కన్నీళ్లకి. కాని, ప్రతిఫలాపేక్షతో, దుఃఖించే వాళ్ల దుఃఖాన్ని పంచుకుంటున్నట్టు ఏడుపు అభినయిస్తారు మరికొందరు స్వార్థపరులు. వారి కన్నీళ్లకే "మొసలి కన్నీళ్లు" అని పేరు. ఈ కుహనా సానుభూతి పరులు యేడవడానికి సిగ్గుపడరు. కాని దొంగలతల్లికి యేడవ సిగ్గట. అవిడే యేడవలేక నవ్వి ఉంటుంది.

ఏడుపు— నవ్వు ఒకదాని కొకటి విరుద్ధం. కాని రెండిటికీ ఆవిష్కరణలో పర్యవసానం ఒకటే ! కన్నీరు ? అందుచేత అశ్రువులు చూడగానే అవి దుఃఖాశ్రువులే అని అనుకోకూడదు.

"నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి!
ఏ కన్నీ రెనకాల ఏముందో తెలుసునా ?
అంది మూగ మనసు (లు) ! !

కన్నీళ్లు దుఃఖంచేత కలిగేవే అయితే వోదార్పటం ముఖ్యం. కలతకీ కన్నీళ్లకీ కారణాలు కనిపెట్టి ఇంద్ర

"తుడుచుకో కన్నీళ్లు
ముడుచుకో అరవిరులు
నడచి వస్తున్నాడు
కడకు నీ విభుడు"

—అని శుభవార్త చెప్పి వూరడించారు.

గుండెల్లో గూడుకట్టుకున్న విషాద భారం తగ్గడానికి యేడుపెంత అవసరమో వూరడింపు అంతే అవసరం.

"కలకాల మీ కలత
నిలిచేది కాదు
కనుమూసి కాసేపు
నిదురించు బాబూ !"

—అని అనునయిస్తే, ఆ మాత్రం చేయూత నిస్తే దుఃఖం నివృత్తి కాకపోయినా, కనీసం తగ్గుతుంది. ఒకోసారి వూరడించబోతే కసిరి కొట్టడం కూడా కద్దు ! 'నువ్వేం ఆరుస్తావా ? తీరుస్తావా' అంటూ !

ఆర్పక పోయినా తీర్చక పోయినా ఆరాలు తీస్తే, కొన్ని యేడుపులు నవ్వు పుట్టిస్తాయి.

ఇద్దరు భార్యలు గల ఒక సంపన్న గృహస్తు కాలధర్మం చెందాడు. అయిన వాళ్లంతా ఏడుస్తున్నారు. ఎవరి యేడుపూ వినబడ నివ్వకుండా మరొకకాయన అందరికంటె బిగ్గరగా యేడుస్తున్నాట్ట. "ఎందుకయ్యా ? ఆయన నీ కెలాటి చుట్టం ?" అని అడిగాట్ట ఓ దారిన పోయే దానయ్య. "ఎలాటి చుట్టరికమూ లేక పోయింది కదా అనే నా యేడుపు" అని యేడ్చాట్ట కానివాడు. విస్తుపోయాడు దానయ్య. అంతకు మించిన వింత మరోటి కనిపించిందాయనకి ! ఇద్దరు భార్యలలో ఒకామె మాత్రమే యేడుస్తోంది ! ఈసారి "నువ్వేడవ లేదేం" అని అడగవలసి వచ్చింది దానయ్యకి. "ఏడ్చిన దాని మొగుడొస్తే నా మొగుడూ వస్తా"డంది యేడవని భార్య.

ఏడుపు రాకపోయినా, వచ్చేటట్టు చేసే ఉపాయం అన్వేషించాడొక విద్యార్థి. 'చెంపకు చెయ్యి పరంబగుచో కంటికి నీరాదేశంబగు' అన్నది అతని సూత్రం !

ఆ యేడుపు దేవుని చెవిని పడాలంటే, జీవి చాలా యాతన పడాలి.

"లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, ప్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె, తనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్,
నీవే తప్ప ఇతః పరం బెరుగ, మన్నింపం దగున్ దీనునిన్,
రావే ఈశ్వర ? కావవే వరద ! సం రక్షింపు భద్రాత్మకా"

అంటే గాని "అలవైకుంఠ పురంబులో నగరిలో. . ." నున్న ఆపన్న ప్రసన్నునికి వినబడదు. అప్పటికి గాని దివి నుండి భువికి దిగిరాడు 'వాడు'. వస్తే ఆ యేడుపు సార్థక మవుతుంది. అప్పటికీ రాకపోతే అరణ్యరోదనం అవుతుంది.

కావ్య చరిత్రపుటలు తిరగవేస్తే నవ్వు ఏడుపుగా మారిన ఉదంతాలు గోచరిస్తాయి. చంద్ర రేఖా విలాసం, చంద్ర రేఖా విలాపంగా మారిందట. ఆ విలాపం రాజుల— కవిరాజుల రోజుల లోది. తెలివి చదువూ గల వారి ఏడుపది ! చదువురాని, ఒక తెలివి తక్కువ వాడి ఏడుపు :

"చిన్నప్పుడు అయ్యవారు
దిద్దించిన అక్షరాలు
బిక్కి చిక్కి పోయె నింత
ఇదియే నా కున్న చింత"

అంటూ అక్షరాలు చూచి ఏడ్చాడా విద్యార్థి !




ఆ విద్యార్థి ఏడుపు మాటెలా ఉన్నా 'అర్థం' అన్ని అనర్థాలకీ కారణం అన్నాడు చిన్నయ్యసూరి.

"ఆర్జనలో ఒక దుఃఖం
రక్షణలో ఒక దుఃఖం
విషాదైక మూలమైన
విత్తమేల కాల్చనా ?" అంటాడాయన!

ధనం రోదనానికి కారణమని సూరి చెబితే, సృష్టి దుఃఖమయం అని నిర్వచించాడు జ్ఞాని !

"జన్మ దుఃఖం జరా దుఃఖం
అది దుఃఖం ఇది దుఃఖం
తస్మాత్ జాగ్రత ! జాగ్రత"

అని ప్రవచించాడాయన. జ్ఞాని మాట వినకపోతే గ్లాని తప్పదు. గ్లాని సంభవిస్తే గాని దేవుడు అవతారా లెత్తడు. రోగ నివృత్తికి మందులు కనిపెట్ట బడవు.

నమ్మి కొలిచిన భక్తుని దుఃఖం తీర్చడానికి కరివరదుడు మకరిని సంహరిస్తే, కన్న తల్లి పతి వియోగ దుఃఖంతో ఇరవై ఒక్కసారి తల బాదుకొని యేడవగా భృగురాముడు ఇరవై ఒక్కసార్లు క్షత్రియులని నిర్మూలించేడు.

రక్తానికి రక్తమే ప్రతీకారం. రోగానికి ప్రతీకారం ఔషధం. ఆత్మీయులు మందులేని జ్వరంతో మరణించగా, ఆ జ్వరానికి మందు కనిపెట్టడానికి పరిశోధనలు చేశాడొక వైద్యుడు. (జ్వరం మందు పేరూ జ్ఞాపకం లేవు గాని, ఈ సంఘటనని కథగా ఆంధ్రవారపత్రికలో ప్రచురించిన వారి పేరు "మురయా.")

తన దుఃఖం లాటిదే అందరిదీ అని భావించిన నాడే దుఃఖోపశమనానికి సాధనాలు అన్వేషింపబడుతాయి. అందరి దుఃఖం తనదిగా తలచి, కుమిలి, పీడిత ప్రజానీకానికి తరుణోపాయం అన్వేషించడానికి అంతఃపురాలు విడిచి అడవులు పట్టి పోయాడు బుద్ధుడు. అదే మహాభినిష్క్రమణ.

"ఆ మహోన్నత భర్మ హర్మ్యాలు దిగుట
ఏ మహోన్నత సౌధాల కెక్క జనుటొ ?"

అని ఆ నిష్క్రమణలోని ఆంతర్యాన్ని వర్ణించారు కరుణశ్రీ. దిగిన భర్మ హర్మ్యాలు అచేతనమైన రాయి రప్పలతో కట్టబడిన కట్టడాలు. ఆరోహించదలచిన మహోన్నత సౌధాలు చైతన్యవంతమైన మానవాళి మనో మందిరాలు.

"పతితులార ! భ్రష్టులార !
బాధాసర్ప దష్టులార
.... ఏడవకండేడవకండి"

—అంటూ అందరి వేదనలూ రోదనలూ తనవిగా స్వీకరించి కలం పట్టాడు శ్రీశ్రీ.

"కన్నీటి కెరటాల వెన్నెలేల ?
నిట్టూర్పు గాడ్పులో నెత్తావి యేల ?"

అన్న దిగులు శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి గారి కృష్ణపక్షంలోనిది.

చీకటి, హాలాహలం, కాళరాత్రి మొదలైనవి విషాదానికి మారుపేర్లు. వెలుగు, అమృతం, ఉదయశ్రీ వాటిపోంచే ఆవిర్భవిస్తాయి. అప్పుడు కన్నీటి కెరటాలే పన్నీటి జల్లులు కూడా అవుతాయి.

★